సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



వెంకటేశ్వరుని సేవలో..

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరిలో ఉన్న అలివేలుమంగ, పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామిని మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు.



దుర్గమ్మ సేవలో సీపీ దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించారు.



రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆర్‌పీఎఫ్, జీఆర్పీ పోలీసులు శనివారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఎక్స్‌ప్లోజివ్, నార్కోటిక్స్ ఎక్స్‌పర్టులు రెమో, చెర్రీ అనే జాగిలాలతో ఈ తనిఖీలు చేశారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కృష్ణాజిల్లాకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళం సమర్పించారు. కంకిపాడుకు చెందిన పి.శ్రీనివాసరావు, సత్యవతి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు శనివారం ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం అందజేసింది. ఆలయ అధికారులకు దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

తిరుపతమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయానికి శనివారం కృష్ణాజిల్లా, ఉయ్యూరు మండలం, గండికుంట గ్రామానికి చెందిన కగ్గా సాంబయ్య దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈ నగదును ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. విరాళంలో రూ.50 వేలు నిత్యాన్నదాన పథకానికి, రూ.50 వేలు అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడానికి వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పాకిస్తానీయులు తక్షణం దేశం విడిచి వెళ్లాలి



కోనేరుసెంటర్: జిల్లాలో పాకిస్తాన్ దేశానికి చెందిన వ్యక్తులు ఎవరైనా ఉన్నట్లయితే ఈనెల 27వ తేదీ లోపు భారత్‌ను విడిచి వెళ్లిపోవాలని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తులు వెంటనే తమ సమాచారం సంబంధిత పోలీస్‌స్టేషన్లకు తెలియజేసి, దేశం విడిచి వెళ్లిపోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో చట్టాల ఉల్లంఘన ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాజ శాంతి, భద్రత కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో లోపాలు ఉన్నాయని, వాటిని తక్షణమే కూటమి ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను డీఎస్సీకి దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇంటర్, డిగ్రీ, పీజీలో మార్కుల శాతంతో సంబంధం లేకుండా డీఎస్సీకి అనుమతి ఇవ్వాలని కోరారు. బీఈడీ, డైట్ చేసి టెట్ అర్హత సాధించిన వారు ఇప్పుడు ఎందుకు అనర్హులు అయ్యారో చెప్పాలని తెలిపారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాము, జి.రామన్న మాట్లాడుతూ సిలబస్ విస్తృతి రీత్యా అభ్యర్థులకు ప్రిపరేషన్‌కు 90 రోజులు సమయం ఇవ్వాలని చెప్పారు. డీఎస్సీ పరీక్షలు జరుగుతున్న సమయంలోనే ఏపీపీఎస్సీ పరీక్షలు, పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు ఉన్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకుని డీఎస్సీ పరీక్ష వాయిదా అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఒక జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు.అనేక మందికి ఎడిట్ ఆప్షన్, సబ్జెక్టు చూపించడం లేదన్నారు. తక్షణమే పై సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

పాతాళంలో మినుము ధర

- మద్దతు ధర రూ.7400 కూడా దక్కని వైనం
- క్వింటా మినుము రూ.6900
- సిండికేట్ మాయతో ధర పతనం
- గతేడాది రూ.9800 పలికిన ధర
- మినుము రైతు నష్టపోతున్నా పట్టించుకోని సర్కారు

మినుము పంట ధర నేల చూపులు చూస్తోంది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర మాత్రం రైతును నిరాశకు గురి చేస్తోంది. రోజు రోజుకీ ధర పతనం అవుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. మార్కెట్‌లో దళారీ వ్యాపారుల సిండికేట్ ఇందుకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. కనీసం మద్దతు ధర కూడా దక్కక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అయినా సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కంకిపాడు: ఈ ఏడాది రబీ సీజన్‌లో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 2,84,237 ఎకరాల్లో మినుము సాగు చేశారు. ఎల్‌బీజీ, పీయూ 31, టీబీజీ, ఘంటసాల, ఇతర సాధారణ రకాలను రైతులు సాగుకు ఎంచుకున్నారు. పంటలో బంగారు తీగ, పల్లాకు తెగులు ఆశించినా, పంట చేతికందిన తరుణంలో అకాల వర్షాలు కురిసినా దిగుబడుల్లో వ్యత్యాసం రాలేదు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ రైతులు పెట్టుబడులు పెట్టారు. ఎకరాకు 7–8 బస్తాలకు తగ్గకుండా దిగుబడులు దక్కాయి. మాగాణిలో అక్కడక్కడా మాత్రం 5 బస్తాల వరకూ దిగుబడులు వచ్చాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ మార్కెట్‌లో ధరలు పడిపోవటంతో రైతులు నీరసించిపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7400 కాగా, బయటి మార్కెట్‌లోనూ అదే ధర ప్రారంభంలో దక్కింది. అయితే రోజురోజుకీ ధర పతనం అవుతూ ప్రస్తుతం క్వింటా రూ.6900కి పడిపోయింది. పెట్టుబడులు పోనూ, కనీసం కూలీ ఖర్చు కూడా చేతికి అందేలా లేదంటూ రైతులు వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు తెరిచినా...?

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే మినుముకు తక్కువ ధర లభిస్తుండటంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. దీంతో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 12 కేంద్రాల్లో మినుము కొనుగోలు కేంద్రాలను మార్చి 19 నుంచి అందుబాటులోకి తెచ్చారు. మార్క్‌ఫెడ్ అధికారుల లెక్కల ప్రకారం మోదుగుమూడి, మల్లేశ్వరం, ఆరుగొలను, పెరికీడు, గుడ్లవల్లేరు, కంకిపాడు, మొవ్వ, పెడన, గంగూరు, బొడ్డపాడు, ఆత్కూరు, ఉయ్యూరులో కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,84,237 ఎకరాల్లో మినుము సాగు జరిగింది. కేవలం 12 కేంద్రాల్లోనే కొనుగోలు కేంద్రాలను తెరిచారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు పంట తరలించటం, కూలీలతో జల్లెడ, కాటా వేయించే పనులకు రైతులే అదనంగా పెట్టుకోవాల్సి వస్తోంది. దూర ప్రాంతంలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు పంటను తరలించేందుకు రవాణా ఖర్చులు, కూలీల ఖర్చులు రూ.4 వేలు–రూ.6 వేల వరకూ అవుతుండటంతో కొనుగోలు కేంద్రాల వైపు రైతులు మొగ్గుచూపటం లేదు.

సిండికేట్ మాయ

రైతులపై పడుతున్న అదనపు పెట్టుబడి భారాన్ని ఆసరాగా చేసుకున్న దళారీలు స్థానికంగా రేటు పెరగకుండా నిరోధిస్తున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో ధరను నిర్ణయించటంలో సిండికేట్ పాత్ర ఉందనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. అదే లేకపోతే గత సీజన్‌లో రూ.9200–రూ.9800 పలికిన ధర నేడు అమాంతం రూ.6900కి ఎలా తగ్గుతుందని ప్రశ్నిస్తున్నారు. దళారుల చేతిలో రైతులు నిట్టనిలువునా దోపిడీ అవుతున్నారని స్పష్టమవుతోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం చలించటం లేదు. రైతు సేవా కేంద్రాల్లో రబీ ధాన్యం మాదిరిగా మినుము కొనుగోళ్లు చేపడితే రవాణా ఖర్చుల భారం తగ్గి, కనీసం మద్దతు ధర అయినా దక్కుతుందనే భావన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి బాగున్నా... ధర లేదన్నా..!



ఈడుపుగల్లు పరిధిలో మినుము నూర్పిడి పనులు (ఫైల్)



మినుము జల్లెడ పడుతున్న కూలీలు (ఫైల్)

పూర్తిగా ధర పతనం



నేను ఎకరం విస్తీర్ణంలో మినుము సాగు చేశాను. దిగుబడి అందరికీ బాగానే వచ్చింది. నాకు మాత్రం 5 క్వింటాళ్లే వచ్చింది. మార్కెట్‌లో ధర పూర్తిగా తగ్గిపోయింది. ఆ రేటుకు అమ్మితే ఖర్చులు కూడా రావు. చేసేది లేక పంటను ఇంటిలో నిల్వ చేశా. మంచి ధర వస్తే అమ్ముదామని చూస్తున్నా.

–బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, రైతు, ప్రొద్దుటూరు

సిండికేట్ దోపిడీ



వ్యాపారులు సిండికేట్ అయిపోయారు. గత సీజన్‌లో రూ.9200 ఉన్న ధర ఈ ఏడాది పడిపోవటానికి వారే కారణం. అదేమంటే బర్మా నుంచి మినుము దిగుమతి అవుతోందంటున్నారు. ఆర్‌ఎస్‌కేల్లో మినుము కొనుగోలు చేయాలి.

–కొండవీటి సుబ్బారావు, రైతు, మంతెన

కూచిపూడి గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- వారసత్వ సంపద గల ప్రాంతంగా గుర్తింపు
- సినీ తారలు, వ్యాపార దిగ్గజాలను భాగస్వాములను చేస్తాం
- వారి ద్వారా నిధులు సమకూర్చేందుకు యత్నం
- వారం లోగా సమగ్ర నివేదికకు కలెక్టర్ ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కూచిపూడి గ్రామాన్ని రాష్ట్ర వారసత్వ సంపద గల ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర నివేదికను వారంలోగా తయారుచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కూచిపూడి నాట్య కళకు మూలకేంద్రమైన గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ గ్రామాభివృద్ధిలో సినీ తారలు, వ్యాపార దిగ్గజాలను భాగస్వామ్యం చేసి వారి ద్వారా నిధులను సమకూర్చే ప్రయత్నం చేయాల్సి ఉందన్నారు. కూచిపూడి వెళ్లే రహదారి మార్గంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా గుంతలను పూడ్చివేయాలన్నారు. గ్రామాభివృద్ధి కోసం యునెస్కో వారికి ప్రతిపాదనలు పంపేందుకు డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు నెలలో కూచిపూడి వార్షికోత్సవాలను యక్షగాన వసంతం పేరుతో వారం రోజుల పాటు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సొసైటీని ఏర్పాటు చేసి కూచిపూడి అభివృద్ధి పనులు, వార్షికోత్సవాల నిర్వహణ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వ్యవస్థను పటిష్టంగా పనిచేసేందుకు కార్పస్ నిధులు సమకూర్చుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకురాలు ప్రసన్నలక్ష్మి, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఉయ్యూరు ఆర్డీవో హేలషారోన్, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డీపీవో జె.అరుణ, జిల్లా పర్యాటక అధికారి రామ్‌లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్ బ్రదర్స్‌కు కలెక్టర్ ప్రశంస



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇరువురు అన్నదమ్ములను కలెక్టర్ డీకే బాలాజీ శనివారం తన చాంబర్‌లో అభినందించారు. ఉంగుటూరు మండలం మధిరపాడు గ్రామానికి చెందిన ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు దుబ్బాకుల దుర్గా యశ్వంత్ 591 మార్కులు, దుబ్బాకుల వీర వెంకటనాగేంద్ర 589 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో ఏం చేయాలనుకుంటున్నారని వారిని అడగ్గా ఒకరు చార్టర్డ్ అకౌంటెంట్, మరొకరు ఇంజినీర్ అవుతామని తెలిపారు. ఉంగుటూరు మండలం మధిరపాడు గ్రామానికి చెందిన ఈ విద్యార్థుల తల్లిదండ్రులు దుబ్బాకుల నరసింహారావు, నాగదుర్గ వ్యవసాయ కూలీలు. అనంతరం కలెక్టర్ అన్నదమ్ములిద్దరికీ సొంత నిధులతో స్మార్ట్ వాచ్‌లను బహూకరించారు. కార్యక్రమంలో డీఈవో పీవీజే రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు దుబ్బాకుల నరసింహారావు, నాగదుర్గ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారాం పాల్గొన్నారు.

వితంతుగా పింఛన్లు!

- వితంతు పింఛన్లకు కూటమి సర్కార్ కొత్త మెలిక
- స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్ల మంజూరు
- వితంతు పింఛన్ అర్థమే మార్చివేసిన ప్రభుత్వం
- 50 సంవత్సరాలకే పింఛన్ హామీ అమలు జరిగేనా?



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): వితంతువులకు పింఛన్లు మంజూరు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా చర్యలు చేపట్టింది. వితంతు పింఛన్ల మంజూరును ఓ తంతుగా మార్చింది. స్పౌజ్ కేటగిరీలోనే పింఛన్లు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతున్న భర్త మృతిచెందితే, అతని భార్యకు మాత్రమే పింఛన్ మంజూరు చేసేలా నిబంధనలు విధించింది.

దరఖాస్తులు స్వీకరిస్తే ఒట్టు

కూటమి అధికారం చేపట్టిన తర్వాత కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కనీసం అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించిన పాపానపోలేదు. తాజాగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్ల మంజూరంటూ అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇక్కడ ఓ మెలిక పెట్టింది. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతూ భర్త మరణించిన భార్యకు స్పౌజ్ కేటగిరీ పేరుతో పింఛన్ మంజూరు చేయాలని నిర్ణయించింది. అదికూడా నిర్దిష్ట కాలానికి మాత్రమేనని మెమోలో స్పష్టం చేసింది. ఎవరైనా వ్యక్తి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతూ డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 మధ్య చనిపోతే అతని భార్యను స్పౌజ్ కేటగిరీ కింద అర్హురాలిగా గుర్తిస్తారు. అక్టోబర్ తర్వాత భర్త మరణించిన మహిళకు పింఛన్ లేనట్లే. ఇది కూటమి ప్రభుత్వం వితంతు పింఛన్లకు విధించిన షరతు. ఇక సాధారణంగా ఎటువంటి సామాజిక పింఛన్ పొందని వారి కుటుంబాల్లో భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్ మంజూరు ఇప్పట్లో లేనట్లేనని ప్రభుత్వం చెప్పకనే చెప్పింది. కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇచ్చింది లేదు. గతంలో ఉన్న పింఛన్లను సర్దుబాటు చేసేందుకు రకరకాల ఎత్తులు వేస్తోంది.

అంతా సర్దుబాటే



కూటమి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు ఇచ్చిందేమీ లేదు. ఉన్న వాటినే సర్దుబాటు చేస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్ల నిండిన వారందరికీ పింఛన్లు ఇవ్వాలి. ఇప్పటికే భర్తలను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారందరికీ వితంతు పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలి. స్పౌజ్ కేటగిరీ దరఖాస్తులతో పాటే వారికి దరఖాస్తులు తీసుకొని పింఛన్లు మంజూరు చేయాలి.

– జి.కోటేశ్వరరావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి

50 ఏళ్లకే పింఛన్ ఊసేదీ..

ఎన్టీఆర్ జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి సామాజిక పింఛన్లు మొత్తం 2,35,477 ఉన్నాయి. ఈ నెల ఒకటో తేదీ నాటికి 2,28,813 మాత్రమే ఉన్నాయి. మరణాలు, ఇతర కారణాలతో 6,664 పెన్షన్లు ఆగిపోయాయి. ప్రస్తుతం స్పౌజ్ కేటగిరీ కింద డిసెంబర్ ఒకటి 2023 నుంచి 31 అక్టోబర్ 2024 మధ్య 3,355 మంది పింఛన్‌దారులు చనిపోయారని, వారి భార్యలు స్పౌజ్ కేటగిరీ కింద సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వీరిలో ఎంత మంది బతికి ఉన్నారో దరఖాస్తులు వస్తేగానీ తెలియదు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 50 ఏళ్లు నిండిన వారు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. వారి నుంచి ప్రభుత్వం కనీసం దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు.

అప్పుడు ఇలా..

గత ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. సంక్షేమ పథకాలను అర్హుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసింది. 50 ఇళ్లకో వలంటీర్‌ను నియమించి ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న వారిని పథకాలు దరఖాస్తు చేయించేవాళ్లు. 35 ఏళ్ల వయసు పైబడిన మహిళలకు భర్త చనిపోతే ఆ మరుసటి నెలలోనే వితంతు పింఛన్ అందించేవారు.

ఈ ప్రభుత్వంలో ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సామాజిక పింఛన్ కూడా మంజూరు కాలేదు. పది నెలలుగా దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. పైగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతువులకు నిబంధనలు విధించడంతో అర్హత కలిగిన వితంతువులు పింఛన్లు పొందలేని పరిస్థితి నెలకొంది. పింఛన్ల కోసం వారం వారం అర్హులు కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వారికి ఎదురుచూపులు తప్పేలా లేవు.

పెత్తనం నీదా.. నాదా.. సై

- జిల్లాపై పెత్తనం కోసం పార్లమెంటు ప్రజాప్రతినిధి దందా
- ఎస్సీ నియోజకవర్గాల్లో నాయకులు జీ హుజూర్ అనాల్సిందే
- అక్రమ సంపాదన కోసం నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు
- ప్రతి నియోజకవర్గంలో పార్లమెంటు ప్రజాప్రతినిధికి ప్రత్యేక వర్గం
- ఈ వింత పోకడలపై మండిపడుతున్న సీనియర్ ప్రజాప్రతినిధులు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: అందినకాడికి దోచుకో..అందినంతా దాచుకో అన్న చందంగా తయారైంది పార్లమెంటు ప్రజాప్రతినిధి తీరు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెతను ఔపోసన పట్టిన ఆ ప్రజాప్రతినిధి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అక్రమ సంపాదన కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు జిల్లా టీడీపీలో ప్రకంపనలు రేపుతున్నాయి. పక్కా ప్రణాళిక ప్రకారం ముందుగా ఎస్సీ నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. ఈ నియోజకవర్గాల్లో తన వ్యూహం ఫలించడంతో మిగిలిన నియోజకవర్గాల్లోనూ వేలు పెట్టడం ప్రారంభించారు. సహజ వనరుల దోపిడీ నుంచి నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు, కార్పొరేషన్ రుణాల మంజూరు ఇలా ప్రతి అంశంలో తన హవానే కొనసాగేలా ముందుకు సాగుతున్నారు. పార్టీ అధిష్టానం సైతం పార్లమెంటు ప్రజాప్రతినిధికే ప్రాధాన్యం ఇస్తోంది. పార్టీ పెద్దలే అండగా నిలవడంతో ప్రతి నియోజకవర్గంలో తన వర్గాన్ని ప్రోత్సహిస్తూ జిల్లా టీడీపీలో అంతర్గత పోరుకు తెరలేపారు. ఈ క్రమంలో సీనియర్ ప్రజాప్రతినిధులంతా పార్లమెంటు ప్రజాప్రతినిధి తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

ఎస్సీ నియోజకవర్గాల్లో పెత్తనం

పార్లమెంటు ప్రజాప్రతినిధి తన అక్రమ సంపాదన కోసం ముందుగా జిల్లాలోని ఎస్సీ నియోజకవర్గాలైన తిరువూరు, నందిగామపై దృష్టి సారించారు. తిరువూరు నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధిపై అధిష్టానానికి వ్యతిరేక భావన ఏర్పడేలా చేయడంలో విజయం సాధించారు. కనీసం స్థానికంగా జరిగే కార్యక్రమాలకు పార్టీ నాయకులు వెళ్లకుండా కట్టడి చేసి అక్కడి ప్రజాప్రతినిధిని ఏకాకిని చేశారు. ఈ నియోజకవర్గంలో మట్టి రవాణాతో పాటు మార్కెట్ యార్డు పదవులు, పార్టీ పదవులు, కార్పొరేషన్ రుణాలను సైతం తన వర్గానికి చెందిన వారికే వచ్చేలా చేయడంలో పార్లమెంటు ప్రజాప్రతినిధి విజయం సాధించారు.

- ఎస్సీ నియోజకవర్గమైన నందిగామలో సైతం పార్లమెంటు ప్రజాప్రతినిధి తన పెత్తనాన్ని కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఉన్న ఎనిమిది ఇసుక రీచ్‌లలో సగానికి పైగా నడవకుండా నిలిపివేసిన పార్లమెంటు ప్రజాప్రతినిధి తన వర్గానికి చెందిన వ్యక్తులతో ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధి, పార్లమెంటు ప్రజాప్రతినిధి మధ్య వైరం నడుస్తోంది. అంతే కాకుండా నామినేటెడ్ పదవుల కేటాయింపులో కూడా రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. సబ్సిడీ రుణాలు సైతం పార్లమెంట్ ప్రజాప్రతినిధి సూచించిన వారికే ఇస్తున్నారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో పార్లమెంటు ప్రజాప్రతినిధి వర్గం, స్థానిక ప్రజాప్రతినిధి వర్గం, టీడీపీ జిల్లా నాయకుడి వర్గంతో ఇక్కడి టీడీపీ పరిస్థితి మూడు ముక్కలాటగా మారింది. ఇక్కడ మార్కెట్ యార్డు పదవి కోసం ఈ మూడు వర్గాలు పట్టుబడుతున్నాయి. అంతే కాకుండా ఇక్కడ ఇసుక అక్రమ రవాణా కోసం పార్లమెంటు ప్రజాప్రతినిధి వర్గం, స్థానిక ప్రజాప్రతినిధి వర్గాల మధ్య పోరు నడుస్తోంది.
- మైలవరం నియోజకవర్గంలో పార్లమెంటు ప్రజాప్రతినిధి, స్థానిక ప్రజాప్రతినిధి ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. అయినప్పటికీ వారిద్దరి మధ్య అంతర్గతంగా తీవ్రస్థాయిలో వైరం నడుస్తోంది. స్థానికంగా ఇసుక, మట్టి, బూడిద వంటి సహజ వనరులు అధికంగా ఉన్నాయి. వీటి అక్రమ రవాణాలో తన వాటా కోసం పార్లమెంటు ప్రజాప్రతినిధి పట్టుబట్టాడు. దీంతో ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య వైరం నెలకొంది.
- విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో సైతం పార్లమెంటు ప్రజాప్రతినిధికి స్థానిక ప్రజాప్రతినిధులకు మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోంది. మొత్తంగా జిల్లా మీద పట్టు బిగించేందుకు ప్రయత్నం చేస్తున్న పార్లమెంటు ప్రజాప్రతినిధి ఈ మూడు నియోజకవర్గాల్లో సైతం గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. విజయవాడ నగర పాలక సంస్థ వ్యవహారాల్లో వేలు పెడుతూ ప్రతి పనిలో కమీషన్ కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు పార్టీకి చెందిన సీనియర్ ప్రజాప్రతినిధులకు మింగుడు పడటంలేదు.

కానుగ కాయలతో జాతీయ జెండా



కానుగ కాయలకు రంగు వేసి రూపొందించిన జాతీయ జెండాతో లిషాన్

పెనమలూరు: కానుగ కాయలకు రంగు వేసి జాతీయ జెండాను రూపొందించాడు చిన్నారి లిషాన్. చిన్నారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకోవటానికి ప్రతిభ చాటాడు. తాడిగడప శివ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థి వినుకొండ లిషాన్‌కు నాలుగున్నర ఏళ్లు. పోరంకికి చెందిన శివప్రసాద్, శిరీష దంపతులు తమ కుమారుడి లిషాన్‌కు చిత్రకళపై మక్కువ ఉండటాన్ని గుర్తించి గిన్నీస్ బుక్ హోల్డర్, ప్రముఖ చిత్రకారుడు పామర్తి శివ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నారు. లిషాన్ ప్రపంచ రికార్డు ప్రయత్నంలో భాగంగా ఈ నెల 25వ తేదీన 1,211 కానుగ కాయలకు కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు వేసి జాతీయ జెండాను రూపొందించాడు. కాయలకు నీలిరంగు వేసి అశోక చక్రాన్ని తీర్చిదిద్దాడు. కానుగ కాయలతో జాతీయ జెండా రూపకల్పనను ఐదు గంటల 11 నిమిషాల్లో పూర్తి చేశాడు. ఈ జెండా 40 అంగుళాల ఎత్తు, 55 అంగుళాల వెడల్పుతో ఉంది. ఈ మేరకు వివరాలను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు, అసిస్ట్ వరల్డ్ రికార్డు సంస్థలకు పంపామని చిత్రకారుడు పామర్తి శివ తెలిపారు.

క్లుప్తంగా

మత్స్యకారులకు చేయూత



చిలకలపూడి(మచిలీపట్నం): మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం గ్రామంలో ఈ పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వీక్షించిన అనంతరం కలెక్టర్ లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 13,077 మంది మత్స్యకారులకు రూ.26.15 కోట్లు అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మత్స్యసంపద సంరక్షణకు సముద్ర తీర ప్రాంతాల్లో ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు వేట నిషేధిస్తామని చెప్పారు. ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.20 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్యయోజన పథకాన్ని మరో ఏడాది పొడిగించిందని, ఈ పథకాన్ని మత్స్యకారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఐ.నాగరాజు, డీడీ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్



గుడివాడటౌన్: గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవిని వైద్యాధికారులు శనివారం సస్పెండ్ చేశారు. ఆమె విధులకు హాజరు కాకుండా హాజరుపట్టీలో సంతకాలు చేస్తున్న విషయాన్ని కొందరు ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన డీసీహెచ్ ఉన్నతాధికారులు 22 రోజులు విధులకు హాజరు కాకుండానే సంతకాలు చేయడంతో పాటు ముఖ ఆధారిత విధానం(ఎస్ఆర్ఎస్) ద్వారా హాజరైనట్లు నమోదు చేసినట్లు గుర్తించారు. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు ఆమెపై చర్యలు తీసుకున్నట్లు ఆదేశించారు. ఇందిరాదేవిపై నామమాత్రపు విచారణ చేపట్టిన అప్పటి డీఎంఅండ్‌హెచ్‌వోపై కూడా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించినట్లు సమాచారం.

అగమ్యగోచరంగా ఐసీఆర్పీలు

- అందని జీతాలు.. నవధాన్యాల కిట్ల లక్ష్యాలతో ఆందోళన
- అప్పుల్లో కూరుకుపోతున్న దుస్థితి
- అధికారుల వింత పోకడలతో బెంబేలు
- కిట్ల కొనుగోలుకు ఆసక్తి చూపని రైతులు



పీఎండీఎస్ కిట్‌లోని నవధాన్యాలు

చల్లపల్లి: ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు ఎవరికి వారు అప్పులు సమకూర్చుకోవాలని అధికారులు చిన్నపాటి ఉద్యోగులపై ఒత్తిళ్లు తెస్తుండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ(ఏపీసీఎన్‌ఎఫ్) విభాగంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఐసీఆర్పీల పరిస్థితి ఇది. పేరుకుపోయిన బకాయి వేతనాలు అందక అప్పుల్లో కూరుకుపోయిన తాము ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించటానికి అప్పులు ఎక్కడ నుంచి తేవాలో తెలియక కకావికలమవుతున్నారు.

జిల్లా స్థాయిలో సిబ్బంది నియామకం..

ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ(ఏపీఆర్‌వైఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఏపీసీఎన్‌ఎఫ్)ను ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాల్లో ప్రాజెక్టు మేనేజరుతో పాటు క్షేత్రస్థాయి వరకూ సిబ్బందిని నియమించారు. కృష్ణా జిల్లాలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌తో పాటు ప్రతి డివిజన్(మూడు మండలాలు)కు ఒక మాస్టర్ ట్రైనర్(ఎంటీ) చొప్పున ఎనిమిది మంది, మండల స్థాయిలో మండల యాంకర్స్(ఎంఏ), ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్(పీఆర్పీ)లు, మండల కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్స్(ఎంసీఆర్పీ)లు మొత్తం 13 మంది, మూడు నుంచి నాలుగు గ్రామాలకు కలిపి ఒక యూనిట్ ఇన్‌చార్జి చొప్పున 25 మంది, వీరి పర్యవేక్షణలో ప్రతి గ్రామైక్య సంఘానికి ఒక ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్(ఐసీఆర్పీ) చొప్పున సుమారు 250 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

కిట్టు ఖరీదు రూ.1,350

రబీ సీజన్ ప్రారంభానికి ముందు రైతుల చేత 32 రకాలతో కూడిన ప్రీమూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్) నవధాన్యాలతో పచ్చిరొట్ట సాగుచేసేలా ఐసీఆర్పీలు పనిచేయాలని అధికారుల నంచి ఆదేశాలొచ్చాయి. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో పాటు రసాయనిక ఎరువులతో సేద్యం చేసే ప్రతి రైతు చేత ఒక్క ఎకరాలోనైనా ఈ సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్క ఎకరాకు పచ్చిరొట్టగా 13.5(ఒక కిట్టు) కిలోల నవధాన్యాలు అవసరమవుతాయి. ఒక్కొక్క కిట్టు తయారీకి సగటున రూ.1,350లు ఖర్చు అవుతుంది. నవధాన్యాలను సేకరించి సంచుల్లో నింపటం, కిట్లుగా కట్టడం, రైతులకు అందజేయటం వంటివన్నీ ఐసీఆర్పీలు చూడాలి. దీనికి అవసరమైన నిధులను సెల్ఫ్ హెల్ప్ గ్రూపు(ఎస్‌హెచ్‌జీ)లకు బ్యాంకుల నుంచి రుణం ఇప్పించి ఆ రుణంతో ఐసీఆర్పీల చేత కిట్లు తయారు చేయించి వాటిని రైతులకు అమ్మి, వచ్చిన డబ్బును డ్వాక్రా గ్రూపులకు కట్టుకోవాలని అధికారులు మార్గం చూపించారు. దాదాపు అన్ని ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు ఇప్పటికే లోన్లు ఉండటంతో కొత్త లోను తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావటంలేదు. ఐసీఆర్పీలే సొంత డబ్బు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

భారీగా పేరుకుపోయిన వేతన బకాయిలు

ఒక్కొక్క ఐసీఆర్పీకి పనిచేసే ప్రాంతాన్ని బట్టి నెలకు రూ.7,500 నుంచి రూ.14 వేల వరకూ వేతనాలు ఇస్తారు. బకాయిపడిన 24 నెలల వేతనాల్లో గత మార్చిలో 12 నెలల వేతనాలు మాత్రమే విడుదల చేశారు. ఇంకా 12 నెలల వేతన బకాయిలు అలాగే ఉన్నాయి. ఒక్కొక్క ఐసీఆర్పీ పరిధిలో సుమారు 50 నుంచి 70 మంది వరకూ రైతులు ఉండగా వారికి ఒక్కొక్క కిట్టు అందించాలంటే ఒక్కొక్క ఐసీఆర్పీ రూ.65 వేల నుంచి రూ.98 వేల వరకు పెట్టుబడి పెట్టాలి. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి పీఎండీఎస్ కిట్లు ఎలా ఏర్పాటుచేయాలో అర్థం కాక తల మునకలవుతున్నారు. కిట్లు టార్గెట్లు పూర్తిచేయకపోతే విధుల నుంచి తొలగిస్తామని అధికారులు చెప్పటం ఆందోళన కలిగిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.1,350 ఖర్చు పెట్టి పచ్చిరొట్ట వేసేందుకు రైతులు ముందుకు రావటంలేదు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రయోజనం లేదు. నవధాన్యాల కిట్లను వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందిస్తే కొంతమేర లక్ష్యాన్ని చేరుకునే వీలుంటుందని కిందిస్థాయి ఉద్యోగులు, ఐసీఆర్పీలు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు, వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్న తమకు ఈ కిట్ల టార్గెట్ల నుంచి విముక్తి కలిగించాలని, పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా రుణాలు..

పీఎండీఎస్ కిట్ల తయారీకి అవసరమైన నిధులను సమకూర్చేందుకు ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు లోన్లు ఏర్పాటుచేస్తున్నాం. ఇప్పటికే వారికి లోన్లు ఉంటే అదనంగా మరలా లోన్లు ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–పార్థసారథి,
జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ఏపీసీఎన్‌ఎఫ్

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీకి ఇన్నోవేషన్ - 2025 పురస్కారం

గుడ్లవల్లేరు: ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని రుస(ఆర్‌యూఎస్ఏ) 2.0 – ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు వారు నిర్వహించిన కార్యక్రమంలో తమ కళాశాలకు ఆవిష్కరణలు–2025 విభాగంలో అత్యుత్తమ పురస్కారం లభించిందని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ శనివారం తెలిపారు. ఆక్వా రైతులకు రొయ్యల పెంపకం, చెరువుల సాగుబడికి ఉపయోగపడే సాధనాన్ని విద్యార్థులు సమకూర్చడంతో ఇన్నోవేషన్–2025 పురస్కారాన్ని, ధ్రువీకరణ పత్రాన్ని ఏఎన్‌యూ రిజిస్టర్ ప్రొఫెసర్ జీ.సింహాచలం శుక్రవారం అందజేశారన్నారు. ఈ ప్రాజెక్టుకు శాస్త్రీయ సలహాదారుడిగా డాక్టర్ బి.మహేష్ బాబు, మెంటార్‌గా డాక్టర్ కె.అశోక్‌రెడ్డి వ్యవహరించారన్నారు. విద్యార్థులను, అధ్యాపకులను ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణ్‌కుమార్, కళాశాల యాజమాన్య సలహాదారులు, అధ్యాపకులు అభినందించారు.

కాల్వలో పడి వ్యక్తి గల్లంతు

గూడూరు: రామరాజుపాలెం కాల్వలో పడి వ్యక్తి గల్లంతైన ఘటన శనివారం మండల పరిధిలోని కోకనారాయణపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం కోకనారాయణపాలెంకు చెందిన సుంకర శివ(40) గ్రామంలోని వంతెనపై ఉండగా ప్రమాదవశాత్తూ కాల్వలో పడిపోయాడు. ప్రస్తుతం కాల్వలో నీరు ఉధృతంగా అధికంగా ఉంది. దీంతో క్షణాల్లో శివ గల్లంతయ్యాడు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి పొద్దుపోయే వరకు గాలిస్తూనే ఉన్నప్పటికీ శివ జాడ దొరకలేదు. శివకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బైక్‌లు చోరీ చేస్తూ.. గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు, వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్‌లు

విజయవాడస్పోర్ట్స్: దొంగిలించిన బైక్‌లను విక్రయించగా వచ్చిన డబ్బులతో గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్న ముఠాను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 9.5 కేజీల గంజాయి, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి వివరించారు. గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు అంశాలపై పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాలతో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో అరెస్ట్ కాకుండా తప్పించుకొని తిరుగుతున్న పాత నేరస్తులపై దృష్టి సారించామని చెప్పారు. ఈ క్రమంలో మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గులాబీతోటతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎ.మనోజ్‌పార్థు(గులాబీతోట), షేక్ అలీబాబా(పెనమలూరు)లను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. నిందితులిద్దరూ జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనం, గంజాయి విక్రయానికి పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో పార్క్ చేసిన బైక్‌లను దొంగిలించడం, ఆ వాహనాలపై ఆంధ్రా–ఒరిస్సా సరిహద్దు ప్రాంతాలకు వెళ్లి, అక్కడ వాహనాలను విక్రయించగా వచ్చిన సొమ్ముతో గంజాయిని కొనుగోలు చేసి విజయవాడకు తీసుకువస్తారని తెలిపారు. ఇదే గంజాయిని స్థానిక యువతకు విక్రయిస్తూ సొమ్ము చేసుకోవడాన్ని నిందితులిద్దరూ వృత్తిగా చేసుకుని జీవిస్తున్నట్లు చెప్పారు. ఈ ముఠా సభ్యులు ఐదుగురు ఉన్నారని, వీరంతా సోషల్ మీడియా ద్వారా పరిచయం అయ్యారన్నారు. ఈ ముఠాలోని ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. నిందితుల నుంచి రూ.60 వేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐలు శ్రీధర్, రవికుమార్ పాల్గొన్నారు.

చెరువులో పడి చిన్నారి మృతి



నవనీత్ మృతదేహం

గూడూరు: ప్రమాదవశాత్తూ చెరువులో పడి చిన్నారి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఆకుమర్రు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కమ్మగంటి నవనీత్(5), అతని అన్న నిహాక్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం గ్రామ శివార్లలోని బాపనకోనేరు చెరువు దగ్గర బహిర్భూమికి వెళ్లారు. ఆ క్రమంలో ప్రమాదవశాత్తూ నవనీత్ చెరువలో పడి మరణం చెందాడు. కళ్లెదుటే ఆటలాడుకుంటున్న తమ్ముడు నవనీత్ చెరువులో పడిపోవడంతో భయాందోళనకు గురైన నిహాక్ వెంటనే ఊరిలోకి వచ్చి కనపర్తి ఆశీర్వాదం అనే వ్యక్తికి విషయం చెప్పాడు. దీంతో ఆశీర్వాదం చెరువు దగ్గరకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టేసరికే నవనీత్ నీటిలో పడి ఊపిరాడక విగతజీవిగా మారాడు. తల్లిదండ్రులు కమ్మగంటి రత్నకుమారి, శివనాగరాజులు కన్నీరు మున్నీరయ్యారు. దీనిపై శివనాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు ఎస్ఐ కేఎన్‌వీ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆస్పత్రిలో బాలుడి మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. చెరువును అక్రమంగా తవ్వడంతోనే తమ కుమారుడు చనిపోయాడని కమ్మగంటి శివనాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ సర్పంచి బొల్లా కృష్ణకుమారితో పాటు గ్రామ నాయకుడు కారుమంచి కామేశ్వరరావులపై ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

11న పీఎం సూర్యఘర్‌పై ప్రత్యేక శిబిరాలు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం మంజూరుకు ఎంపిక చేసిన తొమ్మిది ఆదర్శ గ్రామాల్లో మే 11న ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో పీఎం సూర్యఘర్ పథకంపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకర్లు, ప్రత్యేకాధికారులకు శనివారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకాన్ని నూరు శాతం అమలు చేసేందుకు తొమ్మిది ఆదర్శ గ్రామాలను ఎంపిక చేశామన్నారు. చిన్నాపురం, ఆర్‌వీపల్లి, నందమూరు, ఆత్కూరు, వేలేరు, పెదపారుపూడి, వెంట్రప్రగడ, కేఎస్ఎన్ పాలెం, యార్లగడ్డ గ్రామాలను ఎంపిక చేశామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన వెండార్లను గుర్తించి ఎంపిక చేయాలన్నారు. మే 1 నుంచి 5వ తేదీలోగా లబ్ధిదారుల డాక్యుమెంట్లను సిద్ధం చేయాలన్నారు. వారి వివరాలను బ్యాంకులకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

ఆదర్శ గ్రామానికి రూ.కోటి ప్రోత్సాహకం

మే 11న ప్రత్యేక శిబిరంలో బ్యాంకర్లు, వెండార్లకు లబ్ధిదారులు కోరుకున్న విధంగా రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లోని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని వారి పేర్లు కూడా కొత్తగా నమోదు చేయాలని సూచించారు. ఒక్కొక్క ఆదర్శ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు ప్రోత్సాహకంగా అందజేయనుందన్నారు. ఈ సమాచారాన్ని గ్రామాల్లో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానందం, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ శివప్రసాద్‌యాదవ్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవోలు స్వాతి, హేలషారోన్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో అరుణ, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

‘మత్స్యకారులను మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం’

సాక్షి అమరావతి: మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం వారిని మభ్యపెడుతోందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ విభాగం అధికార ప్రతినిధి నాగిడి సాంబశివరావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన విజయవాడలో ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారని, వారిలో 5 లక్షల మంది వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సముద్రంతో పాటు నదులు, చెరువుల మీద వేటకు వెళ్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. ప్రభుత్వం కంటితుడుపు చర్యగా 1.29 లక్షల మందికి మాత్రమే నామమాత్రంగా మత్స్యకార నిషేధ భృతి పేరిట రూ.258 కోట్లు కేటాయించి మిగతా వారందరికీ అన్యాయం చేస్తోందన్నారు. 2024–25 సీజన్‌కు సంబంధించి వేట నిషేధ భృతిని చెల్లించకుండా ఎగ్గొట్టిందన్నారు. డీజిల్ ఆయిల్ సబ్సిడీ మోటరైజ్డ్ బోట్‌కు 300 లీటర్లు, మెకానైజ్డ్ బోట్కు కేవలం 3 వేల లీటర్లు మాత్రమే ఇస్తూ మత్స్యకారులను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. మత్స్యకార వృత్తిదారులకు ఇవ్వాల్సిన సబ్సిడీ రుణాలు రిలీజ్ చేయడం లేదన్నారు.

కార్పొరేషన్లకు చైర్మన్, డైరెక్టర్లు నియమించలేదు..

ఆప్కాబ్ చైర్మన్‌కు ఎన్నికతో పాటు మత్స్యకార కార్పొరేషన్, బెస్త కార్పొరేషన్లకు చైర్మన్, డైరెక్టర్లను నియమించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా మత్స్యకారుల కోసం 4 పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్లు ప్రకటించి పనులు చేపట్టిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. వేటకు వెళ్లే మత్స్యకారుడికి నామమాత్రంగా ఉన్న రూ.4 వేల వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచడంతో పాటు ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఐదేళ్ల నిధులు విడుదల చేసి ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సాంబశివరావు చెప్పారు.

రేపటి నుంచి శాంతియుత నిరసన

చిలకలపూడి(మచిలీపట్నం): సమస్యల పరిష్కారం కోసం ఆయుష్మాన్ భారత్ ద్వారా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమవారం నుంచి శాంతియుత నిరసన తెలపనున్నట్లు సంఘ నాయకులు నాగబాబు తెలిపారు. కలెక్టరేట్ వద్ద శనివారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 మార్చిలో తమను రిక్రూట్ చేశారని అప్పటి నుంచి సేవలు అందిస్తున్నామన్నారు. ఆరేళ్లు పూర్తయిన అనంతరం కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమను క్రమబద్ధీకరించాల్సి ఉండగా ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదన్నారు. కలెక్టర్ డీకే బాలాజీతో పాటు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి, పోలీస్ అధికారులకు కూడా తాము ఇప్పటికే వినతిపత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు.